# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 11 । జనవరి । 2025

I




**ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ**

అధునాతన విధానాలు అందుబాటులోకి వస్తున్నా.. సేంద్రియ ఎరువుల ఉపయోగం పెరిగింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులిచ్చే వీటి వైపు రైతులు దృష్టి పెడుతున్నారు. -IIలో



**టీడీపీలో ఇరు వర్గాల ఘర్షణ**

ప్రభుత్వ స్థలంలో బంకులు, రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొనే విషయమై టీడీపీలోని ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిన సంఘటన గుర్రంకొండలో చోటుచేసుకుంది. -IIలో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.120 | రూ.150 |
| రెండోరకం | రూ.90 | రూ.110 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నేటి నుంచి కళాశాలలకు సంక్రాంతి సెలవులు

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులుగా ప్రభుత్వం ప్రకటించినట్లు ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం 20న కళాశాలలు పునఃప్రారంభమవుతాయనని, అదే రోజు నుండి 25వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. . ఈ సంక్రాంతి సెలవులలో ఏదైనా జూనియర్ కళాశాల సెలవుల రోజున తరగతులు నిర్వహిస్తే ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు కఠినచర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

### శుభ్రతతో వ్యాధులు దూరం

సంబేపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో 104 సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని అన్నారు. అనంతరం గ్రామంలో పారుతున్న మురుగును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సచించారు.

### 13న బండలాగుడు పోటీలు

రాజంపేట టౌన్: రాజంపేట మండలం ఆకేపాటి ఎస్టేట్‌లో ఈనెల 13వ తేదీ ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యూ కేటగిరి విభాగంలో జిల్లాస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. విజేతలుగా నిలిచే యద్ద యజమానులకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 నగదును బహుకరించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9492532257, 7337515183 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం రాయచోటిలోని జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయం నుంచి పత్రికలకు ప్రకటన విడుదల చేశారు.కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.జూద క్రీడలు కాకుండా సంప్రదాయ ఆటలు ఆడుకోవాలని ఎస్పీ సూచించారు. కోడిపందేలు, పేకాట, గుండాట, చక్కా బొమ్మ లాంటివి ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఉపేక్షించబోమన్నారు. కోడిపందేలు ఆడేవారు, కోడి కత్తుల తయారీదారులు, పేకాట శిబిరాల నిర్వాహకులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

**సమాచారము ఇవ్వండి**

రెండు జిల్లాల్లో ఎక్కడ కోడిపందేలు, జూదం ఆడినా, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్పీ తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

### సోషల్ మీడియాపట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి: సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రజలను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అన్నమయ్య పోలీస్ వాట్సాప్ ఛానల్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం షేర్ చేస్తున్న వారిపైన, మాధ్యమాల అడ్మిన్‌లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. మీ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న వారి వివరాలు, మీ స్థానిక పోలీసులకు తెలియజేయాలని, తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఏదైనా అధికారిక సమాచారం వస్తేనే ప్రజలు నమ్మాలని, ప్రజలను ప్రతి విషయంలో అప్రమత్తం చేసేందుకు అధికారిక వివరాలు తెలియజేయుటకు అన్నమయ్య పోలీసు వాట్సాప్ ఛానల్ ప్రారంభించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఒంటిమిట్ట మాడ వీధుల్లో జగదభిరాముడి ఊరేగింపు



గ్రామోత్సవంలో అలరించిన కోలాట బృందం



నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



# ముక్కోటి శోభ.. ఆధ్యాత్మిక ప్రభ



దేవునికడపలో వైకుంఠ ద్వారంలో దర్శనమిస్తున్న కడప రాయుడు



కడప నగరం దేవునికడపలో క్యూలో వేచివున్న భక్తులు



ఒంటిమిట్టలో స్వామి దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

ముక్కోటి ఏకాదశి వేళ భక్తకోటి మురిసింది. మోక్ష మార్గం ఉత్తర ద్వార దర్శనంతో పరవశం చెందారు. ఆధ్యాత్మిక దివ్యధామం దర్శనంతో పుణ్యప్రదం సిద్ధిస్తుందనే నమ్మకంతో వైష్ణవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

-సాక్షి, నెట్‌వర్క్



ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో సినీనటుడు శ్రీనివాసరెడ్డి



బద్వేలు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

# విషాద ఛాయలు

- వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతితో శోక సంద్రంలో పులివెందుల
- ఆయనతో అనుబంధాన్ని మరువలేమంటున్న జనం

పులివెందుల రూరల్: పారిశ్రామిక వేత్త వైఎస్ ప్రకాష్ రెడ్డి మనుమడు, వైఎస్ మధురెడ్డి కుమారుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన 2017లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజల్లో ముద్ర వేసుకున్నారు. 2018లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగపు ప్రధాన కార్యదర్శిగా పదవి రావడంతో.. పార్టీ ఆదేశాల మేరకు బలోపేతం చేసే విధంగా నిరంతరం కృషి చేశారు. చిన్న పిల్లవాడి నుంచి కార్యకర్తలు, నాయకుడి వరకు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే వారు. రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గంలోనే కాక.. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులలో మంచి పేరు సంపాదించారు. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఒకపక్క రాజకీయాలు, మరో పక్క వైద్య వృత్తిలో రాణిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాలలో ఉంటూ తన వద్దకు ఎవరూ వచ్చినా చిన్న, పెద్దా తేడా లేకుండా.. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సమస్యలను తెలుసుకోవడంలో చొరవ తీసుకుంటుండే వారు. అలాగే వైద్య వృత్తిలో కూడా నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో తనదైన శైలిలో పేరు సాధించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. అనతి కాలంలోనే అధిక గుర్తింపు పొందారు. ఒక్కసారిగా తన అభిమాన నాయకుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసుకున్న పులివెందుల నియోజకవర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎవరూ చూసినా, ఎక్కడ చూసినా మంచి మనస్సున్న నాయకుడిని కోల్పోయామని బాధను వెలిబుచ్చుతున్నారు. అభిషేక్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, చైర్మన్లు, కౌన్సిలర్లతోపాటు మహిళలు చర్చించుకుంటూ ఆయన లేని లోటును మరువలేమన్నారు. శనివారం జరిగే అంత్యక్రియలకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి రాజకీయ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు తరలి రానున్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి (ఫైల్)



పార్టీ కార్యక్రమంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి (ఫైల్)



వైఎస్ అభిషేక్‌రెడ్డి

### వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం బాధాకరం

వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం అత్యంత బాధాకరమని ఆ పార్టీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడు అకాల మరణం చెందడం విచారకరమన్నారు. ఆయన లేనిలోటు పూడ్చలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆయన మరణానికి సంతాపం ప్రకటించారు.

### నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక

కడప సెవెన్‌రోడ్స్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు యలహంకలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.20 గంటలకు జక్కూరు ఎయిరోడ్రమ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు రానున్నారు. 11.40 గంటలకు పులివెందులలోని తన నివాసానికి వస్తారు. 11.40 నుంచి 3.40 గంటల వరకు రిజర్వు. 3.45 గంటలకు తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.50 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5 గంటలకు బెంగుళూరులోని జక్కూరు ఏరోడ్రమ్‌కు చేరుకుంటారు. 5.10 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 5.30 గంటలకు యలహంకలోని తన నివాసానికి వెళ్తారు.

# కష్టతరం.. రైల్‌జర్నీ!



- పండగరోజు ఒకే ఒక్క ప్రత్యేకరైలు
- చాంతాడంతా వెయిటింగ్ లిస్ట్
- అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌తో డే ట్రైన్ రన్ చేయాలి



జిల్లా మీదుగా నడిచే ఎక్స్‌ప్రెస్‌రైలు



రైలులో ఫుట్‌బోర్డు ప్రయాణం తప్పనిసరి

మార్గం: ముంబై-చెన్నై
రైళ్లు: 30 (అప్‌అండ్ డౌన్)

రాజంపేట: సంక్రాంతి వచ్చిందంటే ఆ సందడవేరు. ఎక్కడా ఉన్న సెలవులు తీసుకుని సొంతూరుకు పోవాల్సిందే. పండుగకు కుటుంబసభ్యులందరితో సరదాగా గడపాల్సిందే. అయితే ముంబై-చెన్నై కారిడార్‌లోని గుత్తి-రేణిగుంట రైలుమార్గంలో వచ్చేందుకు..తిరిగి వెళ్లేందుకు ప్రయాణం కష్టతరంగా మారింది. పేద,మధ్యతరగతి ప్రయాణికుల గురించి రైల్వేశాఖ పట్టించుకునే పరిస్థితిలోలేదు. తెలంగాణా, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాలలో ఉన్న వారు ప్రయాణానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

**బెర్త్ దొరక్కపోయినా..**

ఒక్కో బండిలో 500కు పైగా వెయింటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. రైళ్లలో పరిమితి కూడా దాటిపోయి రిగ్రెట్‌కు చేరింది.బెర్తు దొరక్కపోయినా వెయింటింగ్ లిస్ట్ టికెట్‌తో ఏదోలా ప్రయాణించేద్దామనుకునే వారికి ఆ అవకాశం కూడా లేకుండా ఉంది. నిరీక్షణ జాబితా చాంతాడంతా ఉంది.

**మూడునెలల ముందు నుంచే..**

సంక్రాంతి పండుగకు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్నారు. ముందే రిజర్వేషన్లు ప్రారంభం కావడంతో ప్రయాణీకులు టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. మరొకందరు ముందురోజు ఓపెన్ అయ్యే తత్కాల్ మీదే ఆధారపడి ఉన్నారు. తత్కాల్‌లో అయినా టికెట్ దొరుకుతుందనే ఆశలో కొంతమంది ప్రయాణికులు ఉన్నారు.

**ఆర్టీసీ, ప్రైవేటుబస్సులు,**

రైలులో వెళ్లామనుకునే వారికి టికెట్లు దొరకకపోవడంతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, సొంత వాహనాలల్లో ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పండుగ సీజన్‌లో ఆర్టీసీతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ సాధారణం కంటే అధిక చార్జీలు వసూలు చేస్తాయి. దీంతో తక్కువ చార్జీతో రైలులో వెళదామనుకునేవారికి కొంత నిరాశ అనే చెప్పుకోవాలి.

**నలుగురున్న సభ్యులు సొంతూరికి..**

నలుగురు సభ్యులున్న కుటుంబం సొంతూరికి వెళ్లి రావాలంటే ఖర్చు ఎక్కువయ్యే పరిస్థితి నెలకొంది. ఇక రైలులో టికెట్లు దొరకలేని వారంతా బస్సు అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రైల్వేశాఖ పండగ సీజన్ దృష్ట్యా ఏమైనా ప్రత్యేకరైళ్లు నడిపితే వాటిలో టికెట్లు బుక్ చేసుకుందామనే ఆశలు లేవు. ఎందుకంటే జిల్లా మీదుగా ప్రత్యేకరైళ్లు నడపడంలేదు. .

**డే ట్రైన్ రన్ చేయాలని డిమాండ్..**

ఉభయ జిల్లాలమీదుగా అన్‌రిజర్వ్‌డ్ డే ట్రైన్‌ను తెలంగాణాకు నడిపించాలనే డిమాండ్‌ను ప్రజాప్రతినిధులు రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లాలి. ఇలాంటి తరహాలో ఇప్పటికే తిరుపతి నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడమీదుగా నడిపిస్తున్నారు. ఇదే విధంగా రెగ్యులర్‌గా జిల్లామీదుగా తిప్పాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అంటున్నారు.

**పండుగ ముందురోజు ఒకే ఒక్కరైలు..**

పండగ ముందురోజు ఒక్కే ఒక్కరైలును నడిపిస్తున్నారు. ఈనెల 12న (07212/07211) తిరుపతి-నాంపల్లె మధ్య ప్రత్యేకరైలును తిప్పనున్నారు. 12న నాంపల్లిలో రాత్రి 9,45 గంటలకు బయలుదేరి రాజంపేటకు ఉదయం 7.40 గంటలకు, తిరుపతికి 10గంటలకు చేరుకుంటుంది. బోగి రోజున సాయంత్రం 4,35గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు ఉదయం 6గంటలకు నాంపల్లికి చేరుకుంటుంది.

### ఉభయజిల్లాలకు మూడు రైళ్లు

తెలంగాణా నుంచి రెగ్యులర్‌గా ఉభయ జిల్లాలకు మూడు రైళ్లే నడుస్తున్నాయి. అవి చితూర్తు -కాచిగూడ, నిజామాబాద్ టు తిరుపతి, చెన్నై ఎగ్మోర్ టు సికింద్రాబాద్ రైళ్లు. వీటికి యాత్రికుల తాకిడి అధికంగా ఉంటుంది. అటువంటప్పుడు సంక్రాంతి పండుగ సీజన్ ఈ రైళ్లలో బెర్త్ దొరికే పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో చెప్పగలం. బెంగళూరుకు అయితే రైలు లేదు. తిరుపతి నుంచి రావాల్సి ఉంటుంది.

### సంక్రాంతి రద్దీ

13, 14, 15 తేదీల్లో సంక్రాంతి పండుగ నేపథ్యంలో వారంరోజుల ముందునుంచే రైళ్లలో రద్దీ తీవ్రంగా ఉంది. హైదరాబాద్ నుంచి ఉభయ వైఎస్సార్ జిల్లాలోని కడప, రాజంపేట, రైల్వేకోడూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కమలాపురం, నందలూరు తదితర ప్రాంతాలకు వేలాది మంది కుటుంబాలు సంక్రాంతి పండుగకు వచ్చేందుకు కష్టాలు పడాల్సి వస్తోంది. తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఉభయ వైఎస్సార్ జిల్లా వాసులు అనేక మంది వచ్చి, మళ్లీ వెళ్లేందుకు కూడా ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నారు. కొందరికి వెయింటింగ్‌లిస్ట్ రాగా.. మరికొందరికి బెర్త్ దొరకలేని పరిస్థితులున్నాయి.

**కోవిడ్-19 నుంచి నుంచి హాల్టింగ్ సమస్యలు**

కరోనా ఫస్ట్‌వేవ్ నుంచి అనేక రైళ్లను రద్దీ చేసిన క్రమం.. పునరుద్దరణ తర్వాత అనేక రైళ్లకు కొనసాగుతున్న హాల్టింగ్స్‌ను ఎత్తివేశారు. ఉభయజిల్లాలో అనేక స్టేషన్లలో ఇప్పటికీ హాల్టింగ్స్ లేకపోవడంతో తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వారు సొంతూరుకు చేరుకోవడానికి ఇక్కట్లకు గురికాక తప్పడం లేదు.

### సంక్రాంతికి రావాలంటే చుక్కలు



సంక్రాంతికి రావాలంటే చుక్కలు కనిపిస్తాయి. కుటుంబసభ్యులు రైలులో రావాలంటే అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అదృష్టం ఉంటే బర్త్ కన్ఫర్మ్ అవుతుంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా మీదుగా నడిచే రైళ్ల యాత్రికులకే సరిపోవడంలేదు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ రైళ్లు నడిపించాలి. -బయనబోయిన గోపీనాథ్, బీసీహెచ్ ఎలక్ట్రికల్ సంస్థ, మేనేజర్, హైదరాబాదు

### రైలు ప్రయాణం గగనం



సంక్రాంతి పండగకు రావాలన్నా.. తిరిగి వెళ్లాలన్న వ్యయ ప్రయసాలకు గురికాకతప్పదు. రైలు ప్రయాణం రిజర్వేషన్ ఉంటే తప్ప పోలేం. జనరల్ బోగీలో ప్రయాణం ఇక చెప్పనక్కర్లేదు. గతంలో ఉన్న స్టాపింగ్స్ ఇప్పుడులేవు. ప్రయాణికుల సమస్యలను క్షేత్రస్థాయిలో రైల్వే పరిశీలించకపోవడం వల్లనే కష్టాలు. విమాన ప్రయాణం సులభంగా ఉందోమో కానీ రైలు ప్రయాణమే గగనంగా ఉంది. -బిల్లా నరేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వలంటీర్ల సంఘం, రాజంపేట

## క్లుప్తంగా

### బస్సు ఢీకొని విద్యార్థులకు గాయాలు



గాయపడిన విద్యార్థులు

కురబలకోట : అంగళ్లులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట దగ్గరున్న కాలనీకి చెందిన మహమ్మద్ ఫయాజ్(23), ఆద్నాన్ (23) అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అంగళ్లు సమీపంలోని మల్లేల గడ్డ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో వీరి వాహనాన్ని ఢీకొంది. ఫయాజ్, అద్నాన్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వీరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### కుక్క అడ్డు రావడంతో...

మదనపల్లె : కుక్క అడ్డు రావడంతో ఒకరు గాయాలపాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మదనపల్లె మండలంలోని గూటంవారిపల్లెకు చెందిన మునిశేఖర్(21) ప్రయాణీకులతో ఆటోలో వస్తున్నారు. పుంగనూరు రోడ్డులోని వైజంక్షన్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మునిశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### నర్సింగ్ విద్యార్థి అదృశ్యం

సంబేపల్లె : మండలంలోని యర్రగంట్లకు చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్య మైనట్లు సంబేపల్లె పోలీసుల తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన మైనర్ బాలిక రాయచోటిలోని ఓ కళాశాలలో నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి నుంచి కనుపడడంలేదని శుక్రవారం విద్యార్థి తండ్రి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఐచర్ వాహనం బోల్తా



ఒంటిమిట్ట : మండలంలోని చెర్లోపల్లి సమీపాన ఉన్న నేషనల్ హైవే రోడ్డుపై శుక్రవారం ఐచర్ వ్యాన్ టైరు పగిలి వాహనం బోల్తాపడింది. తిరుపతి నుంచి కడపకు సన్ డ్రాప్ గోల్డ్ ఆయిల్ తీసుకొని ఐచర్‌వ్యాన్ బయలుదేరింది. ఒంటిమిట్ట మండలం, చెర్లోపల్లి గ్రామ సమీపం వద్దకు రాగానే టైర్ పగిలి వ్యాన్ బోల్తా పడింది. సుమారు 300 నూనె డబ్బాలు కిందదప డిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. ఒంటిమిట్ట సిఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ లు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

# ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

వ్యవసాయంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పాత కాలం సేంద్రియ సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయాధికారులు సేంద్రియ సాగు చేసే రైతులకు ప్రోత్సాహం ఇవ్వడంతో మరింత మంది ఈ రకమైన పంటలు సాగు చేస్తున్నారు. అధునాతన విధానాలు అందుబాటులోకి వస్తున్నా.. సేంద్రియ ఎరువుల ఉపయోగం ఇటీవల పెరిగింది.

- సేంద్రియ ఎరువులతో రైతులకు లాభం
- పోషకాల శాతం పెరగడంతో ఆసక్తి



పొలాలలో కుప్పలుగా వేసిన ఎరువు

రైల్వేకోడూరు అర్బన్ : రసాయన ఎరువుల వాడకంతో కలిగే అనర్థాలను గుర్తించిన రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. పశువుల పేడ, కోడి ఎరువు, చెరువు మట్టి, పొలాలకు తరలించి నూతనంగా సేంద్రియ సాగు వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత కాలంగా రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గి పంటలకు చీడ పీడలు పెరిగాయి. దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులిచ్చే సేంద్రియ ఎరువుల వైపు దృష్టి పెడుతున్నారు. కొంతకాలం భూమిని కలియదున్ని భూమిలో సేంద్రియ ఎరువైన పేడ దిబ్బలు, చెరువు మట్టి పోసి కలియదున్ని మట్టిలో కలిసిన వెంటనే సేద్యం చేస్తున్నారు. ఈ విధానం మంచి ఫలితాలు ఇస్తాయని చెబుతున్నారు.

**ఎలా నిల్వ చేసుకోవాలంటే**

పంటకు పశువుల ఎరువు వేయకపోతే ఆ ప్రభావం దిగుబడిపై తప్పక చూపుతుంది. ఈ నేపథ్యంలో పశువుల ఎరువు పంటకు సంజీవని వంటిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశువుల పేడను గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ వేయడం కాకుండా.. ఒక పక్క దిబ్బగా పేర్చి.. పశువులకొట్టంలో పేరుకుపోయిన చెత్త, మూత్రం ఒక చోటచేర్చి సమానంగా దిబ్బపై వేస్తున్నారు. అనంతరం కొన్ని రోజులకు పొలాలకు తరలించి.. ఆ దిబ్బలను ఒక చోట చేర్చి అర అడుగు మందంతో మట్టిని పరిచి దానిపై దిబ్బెరువును అడుగున్నర మందంతో వేస్తున్నారు. ఇలా రెండు, మూడు వరుసలు వేసిన తర్వాత 20 రోజులకు బాగా మగ్గడంతో పొలంలో కుప్పలపై చల్లుతున్నారు. తరువాత ఒక మారు దున్ని పంట సాగు చేయడంతో పంటకు పోషకాలు బాగా పడుతున్నాయని పలువురు రైతులు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

**పోషకాల వివరాలు**

| సేంద్రియ ఎరువు | నత్రజని | భాస్వరం | పొటాష్ |
|---|---|---|---|
| పశువుల ఎరువు | 1.5 | 0.9 | 1.9 |
| కోళ్ల ఎరువు | 3.0 | 3.0 | 2.0 |
| గొర్రె మేకల ఎరువు | 0.1 | 0.6 | 3.0 |
| వర్మీ కంపోస్టు | 3.0 | 2.2 | 1.7 |
| గ్రామీణ కంపోస్టు | 1.0 | 0.8 | 1.2 |
| పట్టణ కంపోస్టు | 2.0 | 3.3 | 2.0 |
| వేరుశెనగ పిండి చెక్క | 7.5 | 1.3 | 1.5 |
| వేప పిండి | 5.6 | 1.1 | 1.5 |
| ఆముదం పిండి | 4.4 | 1.9 | 1.4 |
| కానుగ పిండి | 4.0 | 1.0 | 1.4 |
| జీలుగ | 0.62 | 0.15 | 0.10 |
| జనుము | 0.75 | 0.12 | 0.61 |
| అలసంద | 0.71 | 0.15 | 0.68 |
| పిల్ల పెసర | 0.72 | 0.10 | 0.53 |

**ఖర్చులు తగ్గుతాయి**



పశువుల ఎరువు వాడితే ఖర్చులు తగ్గుతున్నాయి. దుక్కులకు ముందే సేంద్రియ ఎరువులు పొలంలో కలియదున్నితే భుసారం పెరుగుతుందనే పాత కాలం పద్ధతి కొనసాగిస్తూ పశువుల ఎరువు వాడి ఖర్చు తగ్గిస్తున్నాం. దీని వల్ల తెగుళ్లు తగ్గాయి.

– సామానేని శ్రీనివాసులు, రైతు, కొత్తపల్లి, ఓబులవారిపల్లి మండలం

**పంటకు ఎన్నో ప్రయోజనాలు**



సేంద్రియ ఎరువును వాడడంతో పంటకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. పశువుల పేడ, చెరువుల పూడిక మట్టిని పొలాలలో వేయడంతో భూమిలో తేమ శాతం ఎక్కువరోజులు వుంటుంది. దీంతో పోషకాలు అందుతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పొలాలలో చీడ పీడలు, తెగుళ్ళు తక్కుతాయి.

– రమేష్, వ్యవసాయ శాఖ అధికారి, రైల్వేకోడూరు

### నా భూమి.. నాకు ఇప్పించండి సారూ..



మాట్లాడుతున్న సంగరాజు సరస్వతి

వృద్ధురాలు కాళ్లు అరిగేలా తిరిగినా అధికారులు కనికరించడం లేదనేందుకు ఈమె సమస్య అద్దంపడుతోంది. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం టీపీ.రాచపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు సంగరాజు సరస్వతి శుక్రవారం తన భూమిని సర్వే చేసి అన్ని హక్కులతో ఇప్పించాలని వేడుకున్నారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ స్థానిక నేత శివశంకర్ నాయుడు దౌర్జన్యంగా తాను ఐదెకరాల్లో సాగు చేసిన బొప్పాయి పంటను తొలగించి దారి లేకుండా చేశారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. – రైల్వేకోడూరు అర్బన్

### మహిళ మెడలో చైన్ అపహరణ

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో జొన్నగడ్డల లక్ష్మిదేవి మెడలో బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం లాక్కెళ్లినట్లు ఆమె కుమారుడు నిమ్మకాయల రంగయ్య తెలిపారు. 3.50 తులాల బంగారు గొలుసు ధరించిన తన తల్లి ఉదయం చిత్రావతి నది పక్కన పొలానికి వెళ్లి రోడ్డు వెంబడి ఇంటికి వస్తుండగా అనంతపురం రోడ్డులో ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఆపి.. ఆమె మెడలోని గొలుసును లాక్కొని వెళ్లారని తెలిపారు.

## సమాచారం ఇవ్వడంలో.. సమన్వయలోపం




అధికారులతో సమీక్షిస్తున్న లంకా దినకర్, చిత్రంలో జిల్లా అధికారులు

- సమీక్షలో సంతృప్తి లేదు.... అన్ని శాఖల మధ్య సమన్వయ లోపం
- జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేయడంలో అధికారులు విఫలం
- 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో సరైన సమాచారం అందడం లేదని 20 సూత్రాల అమలు కార్యక్రమం చైర్మెన్ లంకా దినకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. లంకా దినకర్‌మాట్లాడుతూ జిల్లా సమీక్షలో భాగంగా కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం జిల్లా అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకం 1, 2, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్యఘర్ పథకం, తదితర పథకాల అమలులో లోపం కనిపిస్తోందన్నారు. మన్ రెగ్గాకు రూ.300 వేతనం రావాల్సి ఉండగా.. రూ.259గా ఉందన్నారు. రాబోయే రెండు నెలల కాలంలో సాధ్యమైనంత ఎక్కువ మందికి పనులు కల్పించి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ అంశంలో సరైన నివేదికలు రూపొందించాలని, నీటి వనరుల లభ్యత ఆధారంగా పూర్తిచేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు మెరుగుపరుచుకోవాలని, ప్రతి పంచాయతీకి ఒక డ్రోన్ కేటాయించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలు అందరికీ అందేలా విద్యుత్తు, సెర్ప్, మెప్మా శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాకు విచ్చేసిన 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్‌కు స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి, జేసీ ఆదర్శ రాజేంద్రన్‌లు స్వాగతం పలికారు.

### డబ్బు ఇవ్వలేదని కొడవలితో దాడి



గాయపడిన నారాయణ

మదనపల్లె : అడిగిన వెంటనే డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తిపై కొడవలితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. బాధితుడి వివరాల మేరకు... ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కేశవులు కుమారుడు పి.నారాయణ(35) స్థానికంగా ఓ గది అద్దెకు తీసుకుని గోనె సంచులు కుడుతూ జీవిస్తున్నారు. బుగ్గకాలువకు చెందిన జగదీష్ తరచూ దుకాణం వద్దకు వచ్చి డబ్బు డిమాండ్ చేసేవాడు. రెండు, మూడు సార్లు ఇచ్చినప్పటికీ, శుక్రవారం మరోసారి వచ్చి నారాయణను డబ్బులు అడిగాడు. డబ్బు ఇచ్చేందుకు నారాయణ అంగీకరించకపోవడంతో జగదీష్ కొడవలి తీసుకుని దాడికి పాల్పడ్డాడు. అడ్డుకునేందుకు నారాయణ చేయి అడ్డు పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి విషమించింది. కురబలకోట మండలం అంగళ్లు పెద్దగేటు ప్రాంతానికి చెందిన గంగాధర్ భార్య అమ్ములు(37) కుటుంబ సమస్యలతో సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అదే విధంగా తిరుపతికి చెందిన అన్వర్ కుమారుడు అజ్మల్(47) భార్యతో గొడవపడి కురబలకోట మండలం సింగన్నగారిపల్లెలో ఉంటున్న తమ్ముడి వద్దకు వచ్చాడు. మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అనంతరం వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

## కళాశాలలో నీటి సమస్య తీరింది



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

**రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి**

వీరబల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నీటి సమస్య లేకుండా చూస్తామని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో నిర్మించిన స్టేజీని ఆయనతోపాటు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి, రమేష్ కురవారెడ్డి పాల్గొని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దివంగత గాలివీటి రామకృష్ణారెడ్డి పేరిట ఆయన కుమారులు గాలివీటి వీరనాగిరెడ్డి, గాలివీటి వివేకానందరెడ్డి ఆటస్థలం తయారు చేయడం, కళాశాల అభివృద్ధికి తోడ్పాటునివ్వడం అభినందనీయమన్నారు. కళాశాల సిబ్బంది నీటి సమస్య తీర్చాలని అడిగిన వెంటనే స్పందించి నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిటిసి రాజేంద్రనాథ్ రెడ్డి, ధర్మారెడ్డి, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో ఇరు వర్గాల ఘర్షణ



జాతీయ రహదారిపై చేరిన టీడీపీ వర్గీయులు

**ప్రభుత్వ స్థలంలో బంకుల ఏర్పాటుపై వివాదం**

గుర్రంకొండ : ప్రభుత్వ స్థలంలో బంకులు, రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొనే విషయమై టీడీపీలోని ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ వద్ద ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన ఓ వర్గీయులు మూడు రోజుల కిందట రెండు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. అదే పార్టీకి చెందిన మరో వర్గం పోటాపోటీగా గత గురువారం రాత్రి అదే జెడ్పీహైస్కూల్ ప్రహరీ గోడ వద్ద మరో బంకు ఏర్పాటు చేశారు. దీంతో వివాదం ముదిరి ఘర్షణ తలెత్తడం, శాంతి భద్రతలకు భంగం కలుగుతుందేమోనని ఎంపీడీవో, పంచాయతీ అధికారులు రంగప్రవేశం చేసి పోలీసుల సాయంతో జేసీబీలతో బంకులు తొలగించేందుకు సిద్ధమవడం జరిగిపోయింది. ఇదిలా ఉంటే అదే రోజున మధ్యాహ్నం ఓవర్గం బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్(పభుత్వస్థలం) వద్ద రేకులషెడ్డు ఏర్పాటు చేసే పనులు చేపట్టింది. ఈ ప్రయత్నాలను మరో వర్గం అడ్డుకుంది. దీంతో వివాదం ముదిరి జాతీయ రహదారిపై టీడీపీ వర్గీయులు పెద్ద ఎత్తున చేరి బాహాబాహికి దిగారు. ఎస్ఐ మధురామచంద్రుడు తమ సిబ్బందితో కలిసి అక్కడుకు చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. పోలీసులను లెక్కచేయండా ఓ దశలో రెండు వర్గాలు తిరగబడ్డాయి పోలీసులు పెద్ద ఎత్తున చేరుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమనిగింది. రోజంతా టీడీపీలోని వర్గాల నడుమ చెలరేగిన వివాదం పట్టణంలో సంచలనం రేకెత్తించి చర్చనీయాంశంగా మారింది.



### 11వ వడ్డే ఓబన్న జయంతి ఉత్సవం



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న వడ్డెర విద్యావంతుల వేదిక నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ వడ్డెర విద్యా వంతుల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. రాయచోటిలోని వడ్డెర విద్యావంతుల వేదిక కార్యాలయంలో శుక్రవారం వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ముందస్తు జయంతి నిర్వహించారు. రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రిటీష్ వారితో పోరాటం చేసి 39 సంవత్సరాలకే వీరమరణం పొందిన వడ్డే ఓబన్నను ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించడం సంతోషకరమన్నారు. ఆయన పుట్టినరోజు జనవరి 11న జయంతి ఉత్సవాలు చేయాలని జీఓ జారీ చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రెడ్డయ్య, కుంచపు రెడ్డయ్య, రామకృష్ణ, గాలివీడు శ్రీనివాసులు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

### జేసీబీతో ఇంటి నిర్మాణాల కూల్చివేత



తలారివాండ్లపల్లెలో జేసీబీతో ప్రహరీని కూలుస్తూ...

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని శుక్రవారం జేసీబీతో కూల్చివేయించారు. గ్రామానికి చెందిన జెరిపిటి రామ్మోహన్ కొంత కాలం కిందట ఇంటి నిర్మాణం చేపట్టారు. అక్కడ ఇల్లు కట్టవద్దంటూ గత కొంత కాలంగా అధికార పార్టీ నేతలు అడ్డుతగులుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉన్నపాటుగా టీడీపీ నాయకులు, గ్రామస్తులు జేసీబీతో వచ్చి కొంత భాగం ఇంటి నిర్మాణాలను తొలగించారు. రామ్మోహన్ కుటుంభసభ్యులు అక్కడికి చేరుకని జేసీబీని అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చెలరేగి గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకొన్న ఎస్ఐ మధు రామచంద్రుడు తమ సిబ్బందితో కలసి ఇరువర్గాలతో చర్చలు జరపడంతో వివాదం సద్దుమణిగింది.

### కర్నూలు, నెల్లూరు జట్ల విజయం



తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు



లిఖిత్, చిత్తూరు (61 పరుగులు) జాన్సన్, నెల్లూరు (55 పరుగులు) యశ్వంత్ సూర్యతేజ, కర్నూలు (5 వికెట్లు)


కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్–12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో శుక్రవారం కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 35 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. జట్టులోని పి. లిఖిత్ ఇరగం రెడ్డి 61 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ పార్థివ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 160 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని జాన్సన్ 55 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**కర్నూలు జట్టు విజయం..**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 33 ఓవర్లలో 107 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మోక్షజ్ఞ తేజ్ 36 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ యశ్వంత్ సూర్యతేజ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 29 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ 27 పరుగులు చేశాడు. దీంతో కర్నూలు జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించింది.

## నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

- సమ్మెకు మద్దతు పలికిన ఉద్యోగ సంఘాల నాయకులు
- సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులేసు



ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ నందు ఉద్యమం చేస్తున్న కార్మికసంఘాల నాయకులు శుక్రవారం సీపీఓ సుదర్శన్‌రెడ్డితో శుక్రవారం సమావేశమయ్యారు. స్థానిక ఏపీఎండీసీ కార్యాలయంలో జరిగిన చర్చలు జోరుగా సాగాయి. తమ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని చెబుతూ.. ఈ నెల 16వతేదీ నుంచి సమ్మె చేపడతామని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని, గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. గ్రామ కమిటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే పర్మినెంట్ అయిన వారికి ప్రమోషన్స్ రివైజ్డ్ పే స్కేల్ అమలుచేయాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా యాజమాన్యం చర్యలు తీసుకోకపోతే 16వ తేదీనుంచి సమ్మె నిర్వహిస్తామని, ఇందుకు సీఐటీయూ మద్దతునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాధాకృష్ణ, సీహెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజనేయులు, యూనియన్ నాయకులు ఆర్.వెంకటేష్, ఎస్.శ్రీలక్ష్మి, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని నాలుగు గొర్రెలు మృతి

కమలాపురం : గొర్ల మంద పైకి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో నాలుగు మృతి చెందాయి. బాధితుల సమాచారం మేరకు.. మండలంలోని కుప్పూరువారిపల్లెకు చెందిన మద్దిలేటి, రామయ్య, అయ్యప్పలకు చెందిన గొర్రెలను తీసుకుని శుక్రవారం రాత్రి కుప్పూరువారిపల్లెకు వెళ్తున్నారు. జడ్పీ బాయ్స్ హైస్కూల్ వద్దకు రాగానే కమలాపురం నుంచి కోగటంవైపు వెళ్తున్న ట్రాక్టర్ గొర్ల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 4 గొర్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఏడు గొర్లు గాయపడ్డాయి. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. గొర్రెల మందపైకి ఎక్కిన ట్రాక్టర్‌నిలపకుండా వెళ్లిపోయారని బాధితులు తెలిపారు.